02112024-MAI-04_Layout 1 11/2/2024 1:44 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

సర్కారే కుసంస్కారి అయితే..?

రాజకీయాలను జూదంలా, జాణతనంలా మాత్రమే భావించేవారు పాలకులైతే.. ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడానికి నేడు తెలంగాణ నిదర్శనంలా మారింది. కుసంస్కార సర్కార్ కుప్పిగంతులు విజయాల తెలంగాణను వివాదాలకు నిలయంగా, వేదనకు వేదికగా మార్చాయి. అసలే అది కాంగ్రెస్ పార్టీ, పైగా అదొక కుట్రదారి చేతిలో పావుగా మారడంతో ప్రభుత్వమే పగదారిగా మారిపోయింది. కాంగ్రెస్ పార్టీ మౌలిక స్వభావంలోనే పేదల వ్యతిరేకత, నైతికతలేమి ఇమిడి ఉన్నాయనే వాస్తవం దాని రాజకీయ చరిత్రను చూస్తే మనకు స్పష్టమవుతుంది.

డాక్టర్ ఆంజనేయగౌడ్

ఏగూటి పక్షి ఆ గూటికే చేరుతుందన్నట్లుగా.. అచ్చంగా అవే సుగుణాలతో పెరిగిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి, చెరబట్టి చరిత్రను పునరావృతం చేస్తున్నారు. ప్రభుత్వాలను ప్రజా విరోధులుగా మార్చి, సమాజాన్ని వెనక్కు నడపడంలో హస్తం పార్టీ నేతలందరూ అందివేసిన 'చెయ్యి'లే. ఆ కోవలోనే మరింత వికృతంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన సాగుతున్నది. దానివల్లనే ఏడాదికే తెలంగాణ దుఃఖదాయినిగా మారిపోయింది. హైదరాబాద్‌లో రోదన, గ్రామాల్లో వేదన తప్ప మరో భావోద్వేగం కనిపించడం లేదు. ఏడాది ఏలుబడిలోనే తెలంగాణ వికాసానికి తలకొరివి పెట్టేశారు. పైగా మరో ఏడాదిలో కేసీఆర్ పేరే వినపడకుండా చేస్తానని రేవంత్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతుండటం చూస్తుంటే.. మనిషిలో ఇంత విలనిజం కూడా ఉంటుందా? అని ఆశ్చర్యమేస్తున్నది.

అవివేకులు మాత్రమే తెలంగాణను, కేసీఆర్‌ను వేర్వేరుగా చూస్తారు. కల్యాణలక్ష్మితో సంసారమై పండి, కేసీఆర్ కిట్‌తో మానవవనరులై వర్ధిల్లుతున్న వేలాదిమంది మదిలో నుంచి కేసీఆర్‌ను ఎలా చెరిపేయగలరు? అసలు తెలంగాణ రాష్ట్రం మనుగడలోనే మమేకమైపోయిన నేత కేసీఆర్. ఆయన పేరును చెరిపేయాలని ఉబలాటపడటమంటే.. తీరంలో నిలబడి సముద్రాన్ని మింగేయాలనుకోవడమే. అయినా చారిత్రక నేతల పేర్లు చెరిపేయాలనే తలంపు రావడమే ఎంతటి పైశాచికత్వం? మనిషి ఎంత మరుగుజ్జుగా ఆలోచిస్తే మాత్రం.. అంతగా మంచిచేయాలనే దారి వదిలి, ఎత్తులతో తుడిపేస్తాననే వికారత్వాన్ని నమ్ముకుంటాడు? బహుశా ఈ విపరీత ధోరణి ఇటీవల కాలంలో రేవంత్‌రెడ్డిలో తప్ప దేశంలో మరెవరిలోనూ మనం చూడజాలం. మనస్తత్వంలోనే వైకల్యం ఉన్న వ్యక్తి నుంచి ఉన్నతమైన ఆచరణను ఆశించలేం. నిత్యం కుట్రాజకీయం తప్ప మరో ప్రగతి కోణమే తలంపునకు రాని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతీ చర్యకు ప్రతీకారమే కొలమానంగా మారిపోయింది.

మొన్నటికి మొన్న రాజ్ పాకాల నివాసంలోకి చొరబడ్డ రేవంత్‌రెడ్డి సర్కార్ ఎంతటి పైశాచికత్వాన్ని ప్రదర్శించిందో యావత్ సమాజం గమనించింది. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని విపక్ష పార్టీ నేతల బంధువులను లక్ష్యంగా చేసుకోవడంతో కాంగ్రెస్ సర్కార్ కుట్రలు, బరితెగింపు నైజం బట్టబయలైంది. నిత్యం విపక్షమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాగాన్ని వాడుకోవడం ఎంతటి అన్యాయం? ప్రజల విశ్వాసాన్ని, రాష్ట్ర భవితవ్యాన్ని పణంగా పెట్టి, కేవలం బీఆర్ఎస్ పార్టీని కటకటాల్లోకి నెట్టాలనే కడుపుబ్బర వ్యాధితో రేవంత్‌రెడ్డి సర్కార్ సతమతమవుతున్నది. అందుకే అధికారంలోకి రాగానే కాళేశ్వరంపై ఒంటికాలితో లేచింది. విద్యుత్తు ఒప్పందాలపై విరుచుకుపడి అబాండాలేసింది. తాజాగా ఫార్ములా ఈ-రేసింగ్‌పై రంధ్రాన్వేషణ చేస్తున్నది.

నీళ్లు, కరెంట్‌ను కలిపి తెలంగాణలో సిరులు పండించింది కేసీఆర్ ప్రభుత్వం. ఆవేదనాగ్నిని చల్లార్చి.. ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని ఊరూరా వెలిగించింది పదేండ్ల బీఆర్ఎస్ సర్కార్. కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలు, వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల అధ్యయనాలెన్నో తెలంగాణ ప్రగతిని కొనియాడాయి. గతంలో రాసిన అనేక వ్యాసాల్లో నేనే కాదు, చాలామంది అవగాహనాపరులు ఆ అభివృద్ధి గణాంకాలను ప్రజల ముందుంచారు. అలాగే ఫార్ములా ఈ -రేసింగ్ కూడా అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరుప్రఖ్యాతులను సంపాదించి పెట్టింది. కేసీఆర్‌కు ముందటి ప్రభుత్వాలు కూడా ఈ దేశంలో అనేక రకాల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కోసం వందలాది కోట్ల రూపాయలు వెచ్చించాయి. కామన్వెల్త్, ఆఫ్రో-ఏసియన్ గేమ్స్ ఇలా ఎన్నో మెగా క్రీడా ఈవెంట్లను దేశంలో నిర్వహించాయి. దేశం పేరుప్రఖ్యాతులను విశ్వవ్యాప్తం చేసే ఇలాంటి వాటిపై నీలాపనిందలేయడం మంచి ప్రభుత్వాల నైజం కాజాలదు. అయినా ప్రజల విజయం కోసం శ్రమించే సర్కార్ అయితే, నిన్నటికి మించిన సకారాత్మక పాలనా విధానాలను అమలు చేయడంపైనే దృష్టిసారిస్తుంది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం తన సహజ స్వభావానికి విరుద్ధంగా అలా ఎలా పనిచేయగలుగుతుంది? రేవంత్ సర్కార్‌కు మాయోపాయాలు తప్ప మంచి పనులు చేతకానే కావని తేటతెల్లమైంది. ఆ కోవలోనే ఇప్పుడు తాజాగా దీపావళి బాంబుల బాగోతం బయటపెట్టుకుంది. అయినా బాంబుల వర్షం కురిసినా, ఫిరంగుల మోతమోగినా ఎత్తిన జెండా దించడం, తెలంగాణకు తలవంపులు తేవడం కేసీఆర్ అభిమాన గణానికి తెలియదు.

విపక్షంపై ఇలా ఎన్నో విధాలుగా బ్లేమ్ గేమ్ ఎత్తులు వేస్తున్న రేవంత్ సర్కార్ చివరికి పథకాలను, ప్రభుత్వ విధానాలను కూడా శకుని పాచికల్లా వాడుతుండటమే అందరికీ ఆవేదన కలిగిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీపడ్డ హామీలనూ కుట్రాచరణం చేసేలా కార్యాచరణను అమలు పరుస్తుండటం బాధ కలిగిస్తున్నది. ఇప్పటికే వానకాలంలో వ్యవసాయ రంగానికి వడదెబ్బ సోకించారు. రుణమాఫీ, రైతుభరోసాల అంశంలో సర్కార్ అన్నదాతలతో చెలగాటమెలా ఆడుతున్నదో తేలిపోయింది. దేశంలో చరిత్ర పొడుగునా ఏ ప్రభుత్వాలైనా, పాలకులెవరైనా సరే రైతుల విషయంలో అప్పటికే అమలవుతున్న పథకాలకు అదనపు విలువను జోడించారే తప్ప, కత్తిరించే చర్యలకు పూనుకోలేదు. కానీ, రేవంత్ ప్రభుత్వం మాత్రం రైతుబంధును, రుణమాఫీని కొండంత రాగమాలపించి, కోడి ఈకలు పీకిచ్చినట్లుగా చేసేసింది. ఇక మరో కీలకమైన విద్యారంగమైతే విలవిలాడుతోంది. ఎండమావులను చూపించి, ఉన్న చెరువుగట్టును తెంపినట్లుగా సమీకృత గురుకులాల పేరిట సాంఘిక సంక్షేమ గురుకులాలను క్రమంగా ఖాళీ చేయించే కుయుక్తులు పన్నుతున్నది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ భావజాలంలోనే వివక్షాపూరిత విద్యానమూనా నిక్షిప్తమై ఉన్నది. అందుకే 1959లో కేవలం విద్యాసంస్థలను జాతీయం చేసిందనే ఒకేఒక్క కారణంగా నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని మెజారిటీ ఉన్నప్పటికీ ఇందిరాగాంధీ కూలదోశారు. ఇలా ఎన్నో అన్యాయమైన విధానాలతో దేశంలో సుదీర్ఘకాలం విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలకు పేదవర్గాలను దూరంగా ఉంచిందే కాంగ్రెస్ పార్టీ కదా!

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశంలోనూ నోటితో చెప్పి నొసటితో వెక్కిరించినట్లుగానే కాంగ్రెస్ వ్యవహరించింది. న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకొని, రెగ్యులర్ బీసీ కమిషన్ ద్వారా కాకుండా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సామాజిక, ఆర్థిక సర్వే జరిపించాలని బీఆర్ఎస్ చేసిన సూచనను రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది. బీసీ కమిషన్, ప్లానింగ్ డిపార్టుమెంట్లకు విడివిడిగా జీవోలు ఇచ్చి, చివరికి బీసీ రిజర్వేషన్లు న్యాయ వివాదంలో చిక్కుకునేలా రేవంత్ సర్కార్ కుయుక్తులు పన్నింది. బీఆర్ఎస్ చెప్పినట్టే హైకోర్ట్ కూడా సర్కార్ చేస్తున్న కసరత్తు అశాస్త్రీయమని తేటతెల్లం చేసింది.

ఇలా హైడ్రా, మూసీ.. అన్నింటా వంచనే విధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ కార్యాచరణ సాగుతున్నది. దీని వల్లే తెలంగాణ ఆందోళన బాట పట్టింది. చివరికి సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని ప్రజలు దేహశుద్ధి చేసేదాకా పరిస్థితి విషమించింది. ఇటీవల అకడమిక్ పరిశోధనల్లో ప్రామాణిక సంస్థ అయిన ఈపీడబ్ల్యూ 2014-15 నుంచి 2022-23 మధ్య దేశంలోనే తెలంగాణ ఎలాంటి ఆరోగ్యకర ఆర్థిక వ్యవస్థను అమలుపరిచిందో స్పష్టాతిస్పష్టంగా పరిశోధించి వెల్లడించింది. వనరులు, రుణాలు, వ్యయాల్లో రాష్ట్ర సమతుల్య అభివృద్ధే కొలమానంగా కేసీఆర్ సర్కార్ దేశంలోని మిగతా రాష్ట్ర ప్రభుత్వాల కంటే శాస్త్రీయ పాలనను అందించిందని కొనియాడింది. కానీ, గడిచిన 11 నెలలుగా రాష్ట్ర విత్త నిర్వహణలో గందరగోళం నెలకొన్నా, పాలనలో ప్రతీ చర్య ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నా.. గాంధీల వైపు నుంచి గాని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నుంచి గాని సరిదిద్దే ప్రయత్నాలు జరగడమే లేదు.

వాస్తవానికి 1938లో హైదరాబాద్ కాంగ్రెస్ ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వర్గాలు, కుమ్ములాటలు సహజాతి సహజం. ఆనాడే రామానంద తీర్థ, జనార్దన్ దేశాయ్ మధ్య గోసాయి కాంగ్రెస్, దేశాయి కాంగ్రెస్‌గా విడిపోయి ఒక వర్గం తప్పులను మరో వర్గం బట్టబయలు చేసేవారు. అదే సంస్కృతి ఇప్పటికీ ఉన్నా, శిశుపాలుడి పాపాల మాదిరి రేవంత్ సర్కార్ పాపాలు పెరిగిన తర్వాత కుర్చీ లాగేద్దామని కాంగ్రెస్‌లోని మరో గుంపు రేవంత్‌రెడ్డి దారుణ తప్పిదాలకు తాళమేస్తున్నది. ఇలా పాలనలో, పార్టీలో కుతంత్రాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలే కనిపించడం లేదు. పైగా పోలీసింగ్‌ను నమ్ముకొని అక్రమ కేసులు, దాడుల దారిలో నడక సాగిస్తున్నారు. కాంగ్రెస్ చట్టాలకు చరిత్రలో పెద్ద బాధిత సమాజం తెలుగు ప్రజలే. గతంలో రాజీవ్‌గాంధీ సర్కార్ తెచ్చిన టాడా చట్టం కింద కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో కంటే అప్పటి ఉమ్మడి ఏపీలోని తెలంగాణలోనే అత్యధికంగా 15 వేల మందిపై అక్రమ కేసులు నమోదయ్యాయి. వేల మంది అమాయకులు అరెస్టు అయ్యారు. ప్రభుత్వాన్ని స్వప్రయోజనాలకు వాడుకోవడం, నిలదీసిన విపక్షాలు, జనాలపై నిర్బంధం విధించడం కూడా కాంగ్రెస్ పాలకుల సహజ లక్షణం.

అయితే చరిత్ర కాంగ్రెస్ పార్టీని ఏనాడూ వదిలిపెట్టలేదు, క్షమించలేదు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో మళ్లీ మొలకెత్తలేని దుస్థితిని హస్తం పార్టీకి ప్రజలు కల్పించారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ చర్యలు కాంగ్రెస్ పార్టీకి అదే గతి పట్టించడం ఖాయం. వర్తమానంలో నుంచి భవిష్యత్ అందరికీ చాలా స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నది.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

పచ్చదనంలో ప్రమాద ఘంటికలు

కొలంబియాలోని కాలీలో 2024 అక్టోబర్ 28న జరిగిన జీవవైవిధ్య సదస్సులో ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) తన మొదటి ప్రపంచ వృక్ష అధ్యయన నివేదికను విడుదల చేసింది. ప్రపంచంలోని 38 శాతం వృక్షజాతులు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయని తన 'రెడ్ లిస్ట్'లో తెలిపింది.

ప్రతి మూడింటిలో ఒక వృక్షజాతి అంతర్ధానమయ్యే పరిస్థితి దాపురించడం జీవజాతులన్నింటినీ పెను ప్రమాదంలో పడవేయబోతున్నది. పక్షి, జంతు, సరీసృప, ఉభయచర జాతుల కంటే ఎక్కువ వృక్షజాతులు నశించే ప్రమాదం పొంచి ఉండటం తీవ్రంగా ఆందోళన కలిగించే పరిణామం. దాదాపు 38 శాతం వృక్షజాతులు అంతరించనున్నాయనే ఐసీయూఎన్ 'రెడ్ లిస్ట్' జీవవైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు జరుగబోయే విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్టు చూపుతున్నది.

చెర్మాల శ్రీనివాస్

అడవుల వినాశనం మానవజాతికి మరణశాసనం
- డొరొతీ స్టాంగ్

1948లో స్థాపించిన ఐయూసీఎన్ సంస్థ ప్రకృతి పరిరక్షణ, సహజవనరుల సమర్థ వినియోగంపై అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి స్థితిని, దాన్ని కాపాడటానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఇది కృషి చేస్తున్నది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సమాచార సేకరణ, విశ్లేషణ, పరిశోధన తదితర అంశాలపై జరిగే సమావేశాల్లో పాల్గొని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ సంస్థలకు దిశానిర్దేశం చేస్తుంది. ఈ సంస్థ అక్టోబర్ 28న విడుదల చేసిన రెడ్ లిస్ట్ ఇప్పుడు పర్యావరణ శాస్త్రవేత్తలను, ప్రకృతి ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తున్నది. మొత్తం 47,282 వృక్షజాతులపై మదింపు జరుగగా.. 16,425 జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నట్టు తేలింది. అలాగే ఈ విధ్వంసం బారినపడ్డ వృక్షాల సంఖ్య, అంతరించిపోయే పక్షి, జంతు, సరీసృప, ఉభయచర జాతుల సంఖ్యకు రెండింతలకు పైగా ఉండటం గమనార్హం.

భూగోళ పర్యావరణ వ్యవస్థలో చెట్ల పాత్ర ఎంతో కీలకమైనది. అవి బతుకుతున్నాయడం కంటే మనల్ని బతికిస్తున్నాయనడం ఉత్తమం. భూమిపై జీవం వర్ధిల్లడానికి, కోట్లాది మంది (1600 కోట్లు) మానవుల ప్రాణాలకు, వారి జీవనోపాధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా వృక్షాలు దోహదపడుతున్నాయి.

2020లో ప్రపంచ అటవీ విస్తీర్ణం 4.06 బిలియన్ హెక్టార్లు (1000 కోట్ల ఎకరాలు)గా ఉంది. మొత్తం భూ విస్తీర్ణంలో ఇది 31 శాతం. ఇందులో 54 శాతం కేవలం ఐదు దేశాల్లో (బ్రెజిల్, కెనడా, చైనా, రష్యా, అమెరికా) ఉంది. అటవీ విస్తీర్ణం పరంగా రష్యాది ప్రథమ స్థానం. 2009లో మూడింట రెండొంతుల అటవీ విస్తీర్ణం 10 దేశాల్లోనే ఉండేది. అవి బ్రెజిల్, కెనడా, చైనా, రష్యా, అమెరికా, ఆస్ట్రేలియా, కాంగో, భారత్, ఇండోనేషియా, పెరూ.

2023లో ప్రపంచం 6.37 మిలియన్ హెక్టార్ల అటవీ విస్తీర్ణాన్ని కోల్పోయింది. 2030 వరకు అటవీ నిర్మూలనను పూర్తిగా అరికట్టాలనే 140 దేశాల లక్ష్యం కంటే ఇది 45 శాతం అధికం కావడం గమనార్హం. వివిధ కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా భూగోళం పెద్ద విస్తీర్ణంలో అటవీ భూమిని కోల్పోతున్నది. ప్రాంతం, దేశాలను బట్టి ఆ కారణాలు మారుతున్నాయి. వ్యవసాయ భూమి విస్తరణ, వివిధ అవసరాలకు చెట్ల నరికివేత, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గనులు, దావానలాలు వాటిలో ప్రధానమైనవి. అటవీ నిర్మూలన భయంకరమైన వాతావరణ మార్పులకు దారితీస్తుండటం ఇప్పుడు ప్రపంచాన్ని కలవరపరుస్తున్నది.

మన దేశంలో పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2021 వరకు భారత్‌లో అటవీ విస్తీర్ణం 80.0 మిలియన్ హెక్టార్లు(20 కోట్ల ఎకరాలు)గా ఉండేది. ఇది దేశ భూ భాగంలో 21.71 శాతం. అయితే, 2015-2020 మధ్యకాలంలో ఏటా 6,68,000 హెక్టార్ల మేరకు అటవీ నిర్మూలన జరిగింది. దీని వల్ల భారత్ భారీగా అటవీ భూ భాగాన్ని కోల్పోయింది. 2000 సంవత్సరం నుంచి చూసుకుంటే 23.3 లక్షల హెక్టార్ల అటవీ భూమిని మన దేశం కోల్పోయింది. ఇది ఏడాదికి 6 శాతం.

తెలంగాణ రాష్ట్రం చేపట్టిన హరితహారం కార్యక్రమం అందుకు చక్కటి ఉదాహరణ. దేశంలో అటవీ విస్తీర్ణం పెంపుదలలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ), డౌన్ టు ఎర్త్ నివేదిక ప్రకారం.. 2019 నుంచి 2021 వరకు రాష్ట్రంలో 7 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమమే దీనికి ప్రధాన కారణం.

సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, పంటల మార్పు, పునర్వనీకరణ, అటవీ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అడవుల విస్తీర్ణం తగ్గిపోవడాన్ని నిరోధించగలవు. వ్యవసాయం కోసం జరిగే భూవిస్తరణను ఇవి అరికడతాయి. తత్ఫలితంగా అడవుల నరికివేత తగ్గిపోతుంది. మనకు ఇప్పుడు అందుబాటులో ఉన్న వ్యవసాయ భూమినే సమర్థవంతంగా వాడుకోవడం, మరింత ఎక్కువ దిగుబడి సాధించడమే పై పద్ధతుల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యపరంగా, కట్టడాల నిర్మాణానికి కలపను వాడకుండా ప్రత్యామ్నాయ వనరులు వినియోగించడం, కాగితపు వాడకానికి చెక్క గుజ్జుకు బదులు వేరే పద్ధతులను అన్వేషించడం లాంటివి చెట్లను రక్షింపగలవు. నరికివేతను పూర్తిగా తగ్గించి, పునర్వనీకరణ అంటే అడవులను తిరిగి పెంచడం అంత సులభమేమీ కాదు, అలాగని అసాధ్యం కూడా కాదు. ఉదాహరణకు, కోస్టారికా ఎప్పుడో కోల్పోయిన వర్షాధార ఉష్ణమండల అడవిలో కొంతభాగాన్ని విజయవంతంగా పునరుజ్జీవింపజేయగలిగింది. అయితే, దీనికి 50 ఏండ్లు పట్టింది. అలాగే పునర్వనీకరణలో భాగంగా 1950 నుంచి ఇప్పటివరకు చేపట్టిన పలు కార్యక్రమాల ద్వారా దక్షిణ కొరియా అటవీ విస్తీర్ణం 35 నుంచి 64 శాతానికి పెరిగింది. లక్ష్యాలను సాధించడానికి దశాబ్దాల సమయం పట్టవచ్చేమో గానీ, సానుకూల ఫలితం మాత్రం తప్పకుండా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

తెలంగాణ రాష్ట్రం చేపట్టిన హరితహారం కార్యక్రమం అందుకు చక్కటి ఉదాహరణ. దేశంలో అటవీ విస్తీర్ణం పెంపుదలలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ), డౌన్ టు ఎర్త్ నివేదిక ప్రకారం.. 2019 నుంచి 2021 వరకు రాష్ట్రంలో 7 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమమే దీనికి ప్రధాన కారణం. ఈ కార్యక్రమం కింద గత తొమ్మిదేండ్లలో (2015-2023) 273 కోట్ల మొక్కలు నాటారు. అంతేకాదు, తెలంగాణలో పుట్టి దేశవ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చుకున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 19.5 కోట్ల మొక్కలను నాటడం ఒక రికార్డు. రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన ఈ కార్యక్రమం దేశంలోని ప్రతీమూలకు చేరింది. సెలబ్రిటీలందరూ దీనిలో భాగస్వాములయ్యారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కింద కొంతమంది ప్రముఖులు అడవులను దత్తత తీసుకోవడం విశేషం.

ఈ నేపథ్యంలో ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌ను ఇప్పుడు భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు మరో హెచ్చరికగా చూడాల్సిన అవసరమున్నది. 2030లోపు అటవీ నిర్మూలనను పూర్తిగా అరికట్టాలనే 140 దేశాల సంకల్పం నెరవేరే పరిస్థితులు కనిపించడం లేదు. అంతర్జాతీయంగా అందుకు కావాల్సిన చిత్తశుద్ధి కొరవడటమే అందుకు కారణం. అటవీ నిర్మూలనను అరికట్టే దిశగా కొంతమేరకు వృద్ధి కనిపిస్తున్నా, రెడ్ లిస్ట్ ప్రకారం చూస్తే అది ఏ మాత్రం సరిపోదు. ఇంకా వేగవంతంగా చర్యలు చేపట్టాలి. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ప్రణాళికలను కఠినంగా అమలు చేయాలి.

ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌లో ఉన్న వృక్షజాతులను పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ప్రపంచ దేశాలు మేల్కొని ఈ విషయమై సంబంధిత ప్రభుత్వ సంస్థలతో చర్చించాలి. తగు చర్యలను సత్వరమే చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న అడవులను కాపాడేందుకు వాటిని జాతీయ పార్కులుగా, రిజర్వ్ ఫారెస్టులుగా ప్రకటించాలి. తద్వారా చెట్ల నరికివేత ఆగుతుంది. అదే సమయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలి. గ్రీన్ ఇండియా చాలెంజ్ లాంటి కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా రావాల్సిన అవసరమున్నది. సమాజాన్ని, స్వచ్ఛంద సంస్థలను, వివిధ సంఘాలను, కార్పొరేట్ కంపెనీలను, సెలబ్రిటీలను అందులో భాగస్వాములను చేయాలి. సామాజిక అడవుల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

మనిషి నివసించడానికి, జీవించడానికి ఒకవేళ మరో గ్రహం అనుకూలంగా ఉందంటే.. దానర్థం భూమిని నిర్జీవంగా వదిలేయాలని కాదు. ఈ పుడమిపై ఉన్న జీవవైవిధ్యాన్ని కాపాడటం ప్రతీ మానవుడి విధి. భూమి తనంతట తాను నిర్జీవమయ్యే పరిస్థితి రావడానికి ఇంకా కొన్ని వందల కోట్ల సంవత్సరాలు ఉన్నప్పటికీ, మానవ తప్పిదాల వల్ల అది నేడో రేపో అనే స్థితికి వచ్చింది. ఈ భూమిపైనున్న అన్ని జీవరాశులకు సమాన హక్కులున్నాయి. మానవులకు ఎంత హక్కుందో చెట్టు, పుట్ట, జంతువుకు అంతే హక్కుంది. వాటికి లేనిది మనిషికున్నది మేధస్సు మాత్రమే. తమ ఆవాసాన్ని కాపాడుకోవడానికి ఆ మేధస్సును వాడుకోవాలే గాని, నాశనం చేయడానికి కాదు. ఒక జాతి తప్పు మరో జాతికి మరణ శాసనాన్ని రాయకూడదు. దీన్ని గుర్తెరిగి మేలుకున్నప్పుడే మానవుడు తన బాధ్యతను నెరవేర్చినవాడవుతాడు.

ఏటమటం

మా మాటే శాసనం..

పాపం..! సర్కారోళ్లు ఏ పని పెట్టుకున్నా.. అది ఎదురు గొడుతున్నదట. కారు పార్టీ వాళ్లను ఇరుకునపెడదామని ఎన్ని ఉచ్చులు పన్నినా.. ఆఖరికి అవి హస్తం నేతల మెడకే సుట్టుకుంటున్నయట. ఈ మధ్య ఓ కాంగ్రెస్ నాయకుడు పొలిటికల్ బాంబులు.. ఆటం బాంబులు అనుకుంట చేతులనే పట్టుకొని తిరుగుతున్న విషయం ఎరుకే కదా! అటు దిరిగి ఇటు దిరిగి ఆ బాంబులు వాళ్ల సారు సీటు కిందనే పేలే మోపయ్యాయట. హస్తం గుర్తు కీలక నేత ఒకరు ఢిల్లీ పోయి 'ఈనె ఉంటే ఇందిరమ్మ పెట్టిన పార్టీ ఆగమాగమయ్యే కాడికి వచ్చి'ందని ఫిర్యాదు చేసిండట. 'మరేం జేద్దమంటవ్' అని ఢిల్లీ పెద్దలు అడగగా.. 'నాకు ఇయ్యండి. ఢిల్లీకి ఏం కావాలో నేనే చూసుకుంట' అని అన్నడట. ఈ మాట పెద్దలకు కూడా బాగా నచ్చడంతో.. 'టైం చూసి బొట్టుపెట్టి పిలుస్తం పో' అని ఒట్టేసి చెప్పిండ్రట. అయినా ఆ కీలక నేత కదలకుండా అక్కడే నిలబడ్డడట. దాంతో 'మా మాటే శాసనం. ఇక నువ్వే ముఖ్యనేతవు పో' అని మరోసారి ఆన పెట్టిండ్రట. ఇక అప్పటి నుంచి కీలక సారు అనుచరులు ఆగుతలేరు. 'మా సారు ముఖ్యమంత్రి అని పోస్టర్లు, బ్యానర్లు తయారు చేసి సోషల్ మీడియాల గింగిరాలు తిప్పిస్తున్నరు.

ఎమ్మెల్యేల మొర..!

ఆ మంత్రక్క దంపతులతో ఎవరికి గండముందో తెలియక ఎమ్మెల్యేలు హడలిపోతున్నరట. ఆ మేడం, వాళ్ల సారు కలిసి ఏ నియోజకవర్గానికైనా టూర్‌కి వెళ్తే.. అక్కడి స్థానిక ఎమ్మెల్యేకు గండం పొంచినట్టేనట. వందలాది మంది కార్యకర్తలు జెండాలు పట్టుకొని ఎదురుబడి 'జై కాంగ్రెస్, జైజై అక్క దంపతులు' అంటే చాలు.. ఈ నియోజకవర్గం తమదేనని పుసుక్కున కూసేత్తరట వారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి తామే పోటీ చేస్తున్నమని చెప్పేత్తరట. ఆ మధ్య ఓ పంచాయితీకి పోలీసు స్టేషన్‌కు పోయి ఎస్ఐ సారును లేపి మరీ కూసున్నది గదా..! గా.. మంత్రి దంపతులతోనే ఈ కిరికిరి అంత. పరకాల వెళ్లినప్పుడల్లా.. 'వచ్చేసారి మా బిడ్డదే ఈ సీటు' అని ఓ కూత కూసి వత్తున్నరట వారు. ఆ మాటకు మండిన స్థానిక ఎమ్మెల్యే, ఆ దంపతులు రోడ్డు మీద కొట్టుకున్న సంగతి ఎరుకే గదా. ఈ మధ్య పాలకుర్తికి వెళ్లిన దంపతుల్లో ఒకరు వచ్చే ఎన్నికల్లో తాను ఇక్కడి నుంచే పోటీ చేస్తనని కార్యకర్తలకు చెప్పిర్రట. ఈ మాట విన్న అక్కడి చెయ్యి పార్టీ ఎమ్మెల్యే అగ్గిమీద గుగ్గిలం అయిపోయిందట. భూపాలపల్లి పోయి 'మా అల్లుడు వస్తడు' అని అన్నరట. ఇట్లా ఎక్కడికి పోయినా.. 'మాకు చెరొకటి, మా బిడ్డకు, మా అల్లునికి ఒక్కో నియోజకవర్గం' అని పప్పు బెల్లం పంచినట్టు పంచుతుండటంతో విసుగెత్తిపోయిన ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిర్రట. 'ముందుగా అక్క సీటు ఊడగొట్టి మమ్ముల నిమ్మళంగ ఉంచుర్రి' అని మొరపెట్టుకున్నరట.